తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
బుధవారం
25 ఫిబ్రవరి 2026
పేజీలు : 8
Follow :



## ఖమ్మంలో గుడిసెల కూల్చివేత

### గుడిసెల తొలగింపు హృదయ విదారకం ?

# కన్నీరుమున్నీరైన పేదలు



○వేలుగుమట్ల ప్రాంతంలో ఉద్రిక్తత।
○భారీగా పోలీసుల మోహరింపు

**ఖమ్మం టౌన్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** ఖమ్మం నగర శివార్లలోని వేలుగుమట్ల వినోబా నవోదయ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాదాపు ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఆశ్రయం పొందుతున్న వందలాది పేద కుటుంబాల గుడిసెలను రెవెన్యూ అధికారులు జెసిబి యంత్రాలతో నేలమట్టం చేశారు. యుద్ధ వాతావరణంసుమారు 31 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు భారీగా పోలీసు బలగాలను మోహరించారు. తెల్లవారుజామునే కూల్చివేతలు ప్రారంభించడంతో, నిద్రలో ఉన్న బాధితులు ఒక్కసారిగా దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడ్డారు. తమ ఆశ్రయాన్ని కాపాడుకునేందుకు బాధితులు యంత్రాలకు అడ్డంగా నిలబడి నిరసన తెలపడంతో పోలీసులు, స్థానికుల మధ్య తోపులాట జరిగింది. ముందస్తు సమాచారం లేదని బాధితుల ఆవేదన" ముందస్తు గడువు ఇవ్వకుండా, కనీసం మా సామాన్లు సర్దుకునే అవకాశం కూడా ఇవ్వకుండా రాత్రికి రాత్రే రోడ్డు మీద పడేశారంటే మా పరిస్థితి ఏమవుతుంది?" అని మహిళలు విలపించారు.

**విద్యార్థుల అవస్థలు:**

పరీక్షల సమయంలో పుస్తకాలు, బట్టలు శిథిలాల కింద కలిసిపోవడంతో పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు.

**వృద్ధుల ఆవేదన:**

ఎనిమిదేళ్లుగా ఇక్కడే ఉన్నామని, ఇప్పుడు తమను అనాథలుగా మార్చడం అన్యాయమని వృద్ధులు వాపోయారు.అధికారుల వివరణహైకోర్టు ఆదేశాల మేరకు మరియు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ స్థలంలో 20 ఎకరాలను టిటిడి ఆలయం, ఫంక్షన్ హాల్ మరియు మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. నోటీసుల గడువు ముగిసినందువల్లే తొలగింపు ప్రక్రియ నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో బాధిత కుటుంబాలు తమ మిగిలిన సామాన్లను సర్దుకుంటూ, ఆశ్రయం కోసం దిక్కుతోచని స్థితిలో నిలుచున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి.

## వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇండ్ల కూల్చివేతను తీవ్రంగా ఖండిస్తున్నాం

సీపీఐ(ఎం) నాయకుల అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

2 పేజీలో

## మానవ తప్పిదాలతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు

వివరాలు లో పలి పేజీలో

## డి ఎస్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం

### డి ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు



**హుజూర్ నగర్, (జనంసాక్షి):** ఆపద సమయంలో ప్రతి ఒక్కరు రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని డి ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా దగ్గుపాటి బాబురావు మాట్లాడుతూ మఠంపల్లి మండలం బక్కవత్తులగూడెం గ్రామానికి చెందిన వేముల కోటేశ్వరమ్మ పెద్ద ఆపరేషన్ కి రక్తం తక్కువ ఉండడంతో రక్తం కావాలని డి ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు కి ఫోన్ చేయడంతో వెంటనే బూరుగడ్డ చెందిన జొన్నలగడ్డ పూర్ణకి తెలపడంతో పూర్ణ వెంటనే కోదాడ బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి ూ పాజిటివ్ రక్తం ఇచ్చారు. డిఎస్ఆర్ ట్రస్ట్ తరుపున బూరుగడ్డ చెందిన జొన్నలగడ్డ పూర్ణ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని కోరారు.

## కారు డ్రైవర్ అతివేగం నిర్లక్ష్యంతో యువకుడు మృతి

### రోడ్డు ప్రక్కన దిమ్మెపై కూర్చున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టిన కారు



**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** అసలే నిరుపేద కుటుంబం, గజం భూమి సొంత ఇల్లు లేకుండా జీవనం కొనసగిస్తున్న నిరుపేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అమలుకున్నాయి. కారు ప్రమాదంలో నిరుపేద కుటుంబం రోడ్డు పాలైంది. రెక్కలు ముక్కలు చేసుకుని కుటుంబ పోషణ సాగిస్తున్న యువకుడు మృతితో భార్య కుటుంబ సభ్యుల రోదనలతో చుట్టుపక్కల వాళ్లకు కంటతడి పెట్టాయి. రోడ్డు పక్కన దిమ్మెలపై కూర్చున్న వ్యక్తిని ఎర్టిగా కారు బలంగా ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన యువకుడు షేక్ చాంద్ పాషా తండ్రి వలీముహమ్మద్ (30) రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే లేచి కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం గుమ్మడవల్లి గ్రామంలోని బస్టాండ్ కు ఎదురుగా ఉన్న దిమ్మెలపై కూర్చొని పళ్ళు తోముకుంటుండగా కొండమల్లేపల్లి నుండి నల్గొండకు వెళుతున్న ఎర్టిగా కారు డ్రైవర్ అతివేగం నిర్లక్ష్యంతో దిమ్మెలపై కూర్చున్న షేక్ చాంద్ పాషాను బలంగా ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డుపై పడ్డాడు. దీంతో ఆ యువకుడి తలకు, కడుపుకి కాళ్లకు బలంగా గాయాలైయి రక్తస్రావం జరిగింది. చుట్టుపక్కల వాళ్ళు గమనించి 108 కి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన యువకుడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తలకు, కాళ్లకు కడుపులో బలంగా గాయాలై చికిత్స పొందుతూ షేక్ చాంద్ పాషా మృతి చెందాడు. మృతుడికి భార్య నాలుగేళ్ళ కుమార్తె ఉంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

పి.ఏ.పల్లి మండల కేంద్రంలో

## దొంగల కలకలం..?



2లో

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో

# ఇండ్ల కూల్చివేతను తీవ్రంగా ఖండిస్తున్నాం

❑సీపీఐ(ఎం) నాయకుల అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ

❑సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం టౌన్(జనం సాక్షి)**
ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల గుడిసెల కూల్చివేతను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. పదేళ్లుగా అక్కడే నివసిస్తూ జీవనం సాగిస్తున్న వందలాది పేద కుటుంబాల ఇళ్లను భారీ పోలీస్ బలగాలతో కూల్చివేయడం అమానుషమని ఆయన పేర్కొన్నారు. నివాస హక్కు ప్రతి పౌరుడి మౌలిక హక్కు అని, ఆ హక్కును రక్షించాల్సిన ప్రభుత్వం పేదలను రోడ్డున పడేయడం అన్యాయమని విమర్శించారు. ఇండ్ల కూల్చివేతను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఆందోళన చేసిన సిపిఎం నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అక్రమ చర్య అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయడం ప్రతి ఒక్కరికీ ఉన్న హక్కు అని, ఆ హక్కును అణగదొక్కడం ప్రభుత్వం నిరంకుశ వైఖరిని చూపిస్తోందన్నారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను వెంటనే షరతులేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేద కుటుంబాలందరికీ స్థలాలు కేటాయించాలని, డబల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు తాత్కాలిక నివాసం, ఆహారం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని అన్నారు. పేదల హక్కుల కోసం సిపిఎం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, న్యాయపరంగా మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

సూర్యాపేట (జనంసాక్షి): నాగర్ కర్నూల్ జిల్లాలో కుమ్మెర మల్లన్న జాతరలో శిశువు మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలో తెలంగాణ రజక ఉద్యోగ సమైక్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ దామర శ్రీనివాస్, కో కన్వీనర్ పిల్లుట్ల శ్రీహరి, జిల్లా అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, రాచకొండ నాగయ్య, మునుగోటి యాదగిరి, నెల్లుట్ల శంకర్, కుమ్మరికుంట్ల సురేష్, తాడూరి ఆంజనేయులు, మడిపెద్ది కిరణ్, మాచర్ల కృష్ణ, నేమానందం, దేవదాసు, పజ్జూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.





# పి.ఏ.పల్లి మండల కేంద్రంలో దొంగల కలకలం..?

-గత పది రోజులుగా పలు ఇళ్లలో చోరీలు..!

-పోలీస్ శాఖ వారు రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఉమ్మడి మండల ప్రజల డిమాండ్

**పి.ఏ.పల్లి,ఫిబ్రవరి 24(జనంసాక్షి)**
పి.ఏ.పల్లి మండల కేంద్రంలో గత పది రోజులుగా పలు ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు,రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లిన అదును చూసి మధ్యాహ్నం మరియు గ్రామస్తులు రాత్రి పడుకున్న సమయంలో అర్ధరాత్రి చోరీలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఒక మహిళ ఇంట్లో కూలీ పనులకు వెళ్లిన 28 వేల నగదు,40 తులాల వెండి,తులం బంగారం,మరో మహిళ ఇంట్లో 20 వేల నగదు,అర్ధ తులం బంగారం,మరో వ్యక్తి ఇంట్లో రెండు తులాల బంగారం,సుమారుగా 3 లక్షల నగదు పోయినట్లు సమాచారం.

**- సీసీ కెమెరాలు ఉన్నా.. ఫలితం శూన్యం..!**
మండలం కేంద్రంలో కొన్ని నెలల క్రితం సూర్య హాస్పిటల్ ఎం.డి డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి సహకారంతో సీసీ కెమెరాలు పెట్టారు.సిసి కెమెరాల ప్రారంభోత్సవానికి దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్,అప్పట్లో ఉన్న అడిషనల్ ఎస్పీగా ఉన్న మౌనిక ప్రారంభించారు. కానీ సుమారుగా నెల రోజులుగా సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగలకు పని సులువుగా మారింది.గ్రామంలో దొంగతనం జరిగిన తర్వాత సీసీ కెమెరాలు రిపేర్ చేసినట్లు సమాచారం.

**-రాత్రి సమయంలో పోలీస్ శాఖ వారు పెట్రోలింగ్ నిర్వహించాలని డిమాండ్**
రాత్రి సమయంలో పోలీస్ శాఖ వారు పెట్రోలింగ్ లేకపోవడం వల్ల ఉమ్మడి మండలం వ్యాప్తంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పెట్రోలింగ్ లేకపోవడం వల్ల రాత్రి సమయంలో దొంగతనం చేయడానికి దొంగలు ఇదే అదునుగా భావించి దొంగతనాలకు పాల్పడుతున్నారని,ఉమ్మడి మండల వ్యాప్తంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ వారు రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని,ఉమ్మడి మండల వ్యాప్తంగా ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్ శాఖ వారికి సమాచారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిసిల పై అగ్ర కుల దురహంకార దాడిని

# తీవ్రంగా ఖండిస్తున్నాం

-సతీష్ నాంపల్లి బిజెవైఎమ్ నాంపల్లి మండల అధ్యక్షులు



**నాంపల్లి, ఫిబ్రవరి 24 (జనం సాక్షి)**
దురహంకారానికి బలైన పసి పాప బిసి కులస్థులైన రజకులపై అగ్రకుల దురహంకార దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెవైఎమ్ నాంపల్లి మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ మాట్లాడుతూ, నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మూడు రోజుల క్రితం టికెట్ లేకుండా గుడిలోని ప్రవేశించారనే నెపంతో కుల దురహంకారంతో అదే గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి, సతీష్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,మధు రెడ్డి,అసభ్యకరమైన భాషలో బండ బూతులు తిడుతూ అతి భయంకరంగా వారిపై దాడి చేయడంతో పాటు రెండు నెలల పసిబిడ్డ ని కాలితో తన్ని చంపారు. వెంటనే నిందితులపై మర్డర్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి అగ్ర కుల దురహంకారులతో ప్రాణభయం ఉండటంతో జిల్లా ఎస్పీ మరియు కలెక్టర్ వారికి తగిన భద్రత కల్పించాలని మరియు తగు నష్టపరిహారం చెల్లించి అగ్ర కుల దురహంకారుల చేతిలో గాయపడిన వారికి తక్షణమే వైద్య సదుపాయం కల్పించాలని నాంపల్లి సతీష్ డిమాండ్ చేశారు.

# అక్రమ రవాణా నివారణలో అంగన్వాడీ టీచర్ల పాత్ర అత్యంత కీలకం

జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి విజేత






**ఖమ్మం, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):**
ఖమ్మం నగరంలోని టేకులపల్లి డబుల్ బెడ్ రూమ్ కమ్యూనిటీ హాల్‌లో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో అంగన్వాడీ టీచర్లకు మనుషుల అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్ అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి విజేత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మనుషుల అక్రమ రవాణా ఒక అంతర్జాతీయ సమస్యగా మారిందని, ముఖ్యంగా మహిళలు మరియు బాలికలు ఎక్కువగా దీని బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రేమ, వివాహం, ఉద్యోగం, సినిమా అవకాశాలు, డబ్బు ఆశ చూపిస్తూ మోసం చేసి ఇతర ప్రాంతాలకు తరలించి వ్యభిచార గృహాల్లో అమ్మివేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అక్కడ బాధితులు అమానుష హింసకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి అంగన్వాడీ టీచర్ అక్రమ రవాణాపై సమగ్ర అవగాహన పెంపొందించుకొని నివారణలో చురుకైన పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారతీయ న్యాయ సంహిత, ఇమ్మోరల్ ట్రాఫికింగ్ నివారణ చట్టం, పోక్సో చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టం వంటి చట్టాలపై వివరించారు. అలాగే 1098 (చైల్డ్ లైన్), 100 (పోలీస్), 181 (మహిళా సహాయవాణి), 1930 (సైబర్ క్రైమ్ సహాయవాణి) వంటి అత్యవసర సేవల నంబర్లను తెలియజేశారు. సమాజంలో అక్రమ రవాణా నిరోధానికి జాగృతి సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వీరభద్రమ్మ,ప్రజ్వల సంస్థ సమన్వయ కర్త సురేష్ కుమార్, సూపర్వైజర్లు, ప్రజ్వల సిబ్బంది అనిల్ కుమార్, మిథాలి రాజ్‌తో పాటు ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## కారేపల్లిలో రెండు కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు

**కారేపల్లి, ఫిబ్రవరి24(జనంసాక్షి) :**
కారేపల్లి మండలంలోని ఇంటర్మీడియట్ రాస్తున్న పరీక్షలకు మండల కేంద్రమైమ కారేపల్లి లో రెండు పరీక్షాకేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 25వ తేది నుండ జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాలలో విద్యార్థులుఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 250 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు 181 మంది పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. మోడల్ స్కూల్(43032)లో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 284, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 240 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఆర్అండ్బీ ఎస్ఈ

**కారేపల్లి, ఫిబ్రవరి24(జనంసాక్షి) :**
కారేపల్లిా పేరుపల్లి మధ్య బీటీ, సీసీ రోడ్డు పనులను ఆర్ అండ్ బీ ఎస్ఈ యాకూబ్ మంగళవారం పరిశీలించారు. కారేపల్లి సోసైటీ కార్యాలయం సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జీ పనులను ఆయన పరిశీలించారు. కోమరం భీం సెంటర్ నుండి పేరుపల్లి రైల్వేగేటు వరకు సీసీ రోడ్డు పనులను ఎస్ఈ తనిఖీలు చేశారు. నిర్మాణంలో తీసుకోవల్సిన చర్యలను ఏఈ, కాంట్రాక్టర్ సూచనలు చేశారు. రహదారి పనులను వాడుతున్న మెటిరీయల్లు, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. పనులనాణ్యతలో రాజీ లేకుండా చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు.



## కుమ్మెర పసికందు హంతకులను శిక్షించాలి అఖిలపక్షం డిమాండ్

**పెనుబల్లి, ఫిబ్రవరి 24(జనంసాక్షి)**
నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లికార్జున స్వామి జాతరలో పసికందును హత్య చేసిన హంతకులను శిక్షించాలని పెనుబల్లి మండల అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం వీ ఎం బంజర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశమైన అఖిలపక్ష నాయకులు పసికందు హత్య సంఘటనను తీవ్రంగా ఖండించారు. అగ్రకుల దురహంకారంతో గ్రామంలోని రెడ్డి కులస్తులు గ్రామంలో జరిగే జాతరలో పసికందు తండ్రిని విపరీతంగా కొట్టారన్నారు. ప్రాదేయపడ్డ వారి మాట వినకుండా పసికందును కాలితో తనడంతో మరణించినట్లు పేర్కొన్నారు. హంతకులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు చలమాల విఠ్రలావు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కాటినేని శ్రీనివాస రావు, బీసీ సంఘ నాయకులు పంతంగి వెంకటేశ్వరావు,చిట్టిమోతుల కృష్ణ, చక్కిలాలమంగే శ్వరరావు,మాలమహానాడు జాతీయ నాయకులు మేకతొట్టి కాంతయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు దిలీప్ విజయ్ కుమార్, తడి కమళ్ళ చిరంజీవి, మరకాల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



### అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మత్స్యశాఖ శాఖ సహకార సంఘం

# ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనా..!



- ✧ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న మత్స్యశాఖ అధికారులు
- ✧ అక్కంపల్లి రిజర్వాయర్ యందు చేపలు లూటీ అవుతున్న పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- ✧ గత పది సంవత్సరాలుగా అక్కంపల్లి రిజర్వాయర్ సొసైటీ ఎన్నికలు నిర్వహించని వైనం

**పి.ఏ.పల్లి,ఫిబ్రవరి 24(జనంసాక్షి )**
పి.ఏ.పల్లి మండలం అక్కంపల్లి రిజర్వాయర్ సొసైటీకి మత్స్యశాఖ అధికారులు సొసైటీ ఎన్నికలు నిర్వహించడంలో విఫలమయ్యారు.గత పది సంవత్సరాల క్రితం సొసైటీ ఎన్నికల నిర్వహించగా,సొసైటీ కాలం తీరి పది సంవత్సరాలు అయినప్పటికీ కూడా సొసైటీ ఎన్నికలు నిర్వహించడంలో మత్స్య శాఖ అధికారులు విఫలమయ్యారని సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్కంపల్లి రిజర్వాయర్ యందు చేప పిల్లలను పంపిణీ చేస్తుంది.సొసైటీ యందు దాదాపుగా 550 సభ్యత్వాలు ఉన్నాయి.కానీ అనధికారంగా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ యందు చేపలు లూటి అవుతున్నా కూడా మత్స్య శాఖ అధికారులు లంచాలు,మామూళ్లకు అలవాటు పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టినట్లు అవుతుంది

**- వికలాంగులకు,ఉద్యోగస్తులకు సొసైటీలో సభ్యత్వాలు.!**
గతంలో లంచాలకు పాల్పడిన అధికారులు సొసైటీలో బ్యాలెన్స్ రిజర్వాయర్ యందు వికలాంగులకు,ప్రభుత్వ ఉద్యోగస్తులకు కూడా సొసైటీలో సభ్యత్వాలు ఇచ్చారు అని సభ్యత్వాలు రానివారు ఆరోపిస్తున్నారు.వారిని తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని సొసైటీలో సభ్యత్వం కావాలనే వారు కోరుతున్నారు.

**- పెన్షన్ తీసుకుంటున్న, చనిపోయిన వారి సభ్యత్వాలు తొలగించని మత్స్యశాఖ అధికారులు**
అక్కంపల్లి రిజర్వాయర్ సొసైటీ యందు పెన్షన్ తీసుకుంటున్న వారు,చనిపోయిన వారి సభ్యత్వాలు తొలగించకుండా మత్స్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వికలాంగులు,ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ తీసుకుంటున్న వారి పేర్లు,చనిపోయిన వారి సభ్యత్వాలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

**- కొత్త సభ్యత్వాలు లేనట్లేనా.?**
అర్హులైన వారికి కొత్త సభ్యత్వాలు అందించాలని అక్కంపల్లి రిజర్వాయర్ యందు సభ్యత్వం కావాలనే వారు డిమాండ్ చేస్తున్నారు.

# సిద్ధారంలో పోడు సమస్యలు పరిష్కరించాలి

**○ఐటిడిఏపిఓ ని కలిసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య**



**టేకులపల్లి,ఫిబ్రవరి 24(జనంసాక్షి):**
టేకులపల్లి మండలంలోని సిద్ధారంలోని ఆదివాసి గిరిజనుల పోడు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఐటీడీఏ పీవోని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య వారి కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు.టేకులపల్లి మండలం సిద్ధారం గ్రామంలో గత కొన్ని దశాబ్దాలు గా పోడు భూమి సాగుచేసుకుని జీవనం కొనసాగిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం కొంతమందికి మాత్రమే పట్టాలు ఇచ్చి మరి కొంత మందికి పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా వారు ఎంతో కాలం నుండి పంటలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న గిరిజనులను ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా ఈ సంవత్సరం పత్తి పంటను తీయనియకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పంటలు పండిస్తే ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాల కారణంగా గిరిజన రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరమే ఐటీడీఏ పీవో జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించి రైతులకు పంటలు తీసుకునే అవకాశం కల్పించాల ని, ఆ తరువాత సమగ్ర సర్వే జరిపి గిరిజన రైతులకు అటవీ హక్కుల పట్టాలు ఇవ్వాలని కోరారు. గ్రామంలో గిరిజన రైతుల మధ్య కొంత మందికి పట్టాలు ఇచ్చి కొంతమందికి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేయటం కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, గిరిజనుల మధ్య వైశ్యామ్యాలు పెరిగే అవకాశం ఉందని గుమ్మడి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే ఈ సమస్యను పరిష్కరించకపోతే గిరిజనులను కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. టేకులపల్లి మండలంలో కొండంగలబోడు గ్రామంలో అటవీ హక్కుల పట్టా కలిగిన గిరిజన రైతు జరపుల సుందర్ తన పొలంలో వ్యవసాయ నిమిత్తం తుప్పలు తొలగించి వ్యవసాయానికి సిద్ధం చేస్తున్న అతనిపై స్థానిక ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా అక్రమ కేసు బనాయించి ఇబ్బందులకు గురి చేశారని, ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు ఈ దౌర్జన్యాలను ఆపకపోతే గిరిజనుల వైపు నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి వెంట సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ,డివిజన్ నాయకులు ఆజాద్, సుందర్, గిరిజన రైతులు కంగాల నాగేశ్వరరావు, కొరస మల్లయ్య, దొడ్డ అంజయ్య, కొమరం దినేష్,పాయం వెంకటేశ్వర్లు, మలకం ఆదినారాయణ, జోగా శ్రీను, కొరస శ్రీకాంత్, పాయం లక్ష్మీనారాయణ,జరపుల సుందర్,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం జిల్లాకమిటీ సభ్యులు యళ్లపల్లి ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

# నడిరోడ్డుపై అక్రమ మెడికల్ షాప్?

**ఇష్టానుసారంగా రోడ్డు నిర్మాణం? సీసీ రోడ్ ధ్వంసం ? ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం**





**చింతకాని, ఫిబ్రవరి 24(జనం సాక్షి)** కొణిజర్ల నుండి చింతకాని వరకు నిర్మిస్తున్న ఆర్ అండ్ బి రహదారి పనుల్లో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నేరడ గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ప్రమాదకరమైన మూలమలుపు వద్ద నడిరోడ్డుపై అక్రమంగా నిర్మించిన మెడికల్ షాప్‌ను తొలగించకుండా గుత్తేదారుడు తన ఇష్టానుసారంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నాడని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన సీసీ రోడ్డును సుమారు 50మీటర్ల మేర పూర్తిగా ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టేటప్పుడు పాత బీటీ రోడ్డుకు ఇరువైపులా సమాన కొలతలు తీసుకుని పనులు చేయాల్సి ఉండగా, మెడికల్ షాప్ తొలగించకుండా మరోవైపు ఉన్న నిరుపేదల ఇళ్ల స్థలాల వైపు అధికంగా రోడ్డు విస్తరణ చేపట్టారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కోటా హుస్సేన్ ఖాళీ స్థలం, ఏర్పుల రవి నిర్మించుకున్న రేకుల ఇళ్లు తదితర నిరుపేదల ఇళ్ల స్థలాలు నష్టపోతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మేము కూలి పనులు చేసి కష్టపడి కొనుక్కున్న ఇళ్ల స్థలాలు కోల్పోతున్నాం" అంటూ వారు లబోదిబోమంటున్నారు. గుత్తేదారుడు, మెడికల్ షాప్ యజమాని మధ్య కుమ్మక్కు ఉందని, దీనిపై ఆర్ అండ్ బి అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదకరమైన మూలమలుపులో నడిరోడ్డుపై ఉన్న అక్రమ మెడికల్ షాప్‌ను తక్షణమే తొలగించి, పాత బీటీ రోడ్డుకు ఇరువైపులా సమాన కొలతలతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని రోడ్ సైడ్ నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్ అండ్ బి అధికారులు మాత్రం స్పందించకపోవడం పట్ల స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## అధిక రసాయన ఎరువులు వాడకం భూసారానికి ముప్పు

**○ ఏవో శంకర్**



**బూర్గంపహాడ్ ఫిబ్రవరి 24 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- రసాయన ఎరువులు అధికంగా వాడితే భూసారానికి ముప్పుతప్పదని మండల వ్యవసాయాధికారి శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రైతులకు అధిక ఎరువుల వాడకంలో కలిగే నష్టాలపై పలు సూచనలు చేశారు. భూసారం తగ్గకుండా అన్నదాతలకు ఆయన పలు సూచనలు చేశారు. నేల జీవవైవిధ్యాన్ని పరిరక్షించి పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులను పెంపొందించేలా పశువుల ఎరువు, కంపోస్టు తదితర సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలన్నారు. నేల భౌతిక, రసాయన, జీవ సంబంధిత లక్షణాలను మెరుగుపరిచేలా జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట పైర్లను పెంచి నేలలో కలియదున్నాలని, గాలిలో నత్రజనిని స్థిరీకరించి భూసారం పెంచి మొక్కలకు పోషకాలు అందుబాటులోకి తెచ్చే అజటోబాక్టర్, అజోస్పైరిల్లం తదితర ఎరువులు వాడాలన్నారు. నేలలో పోషకాలు, సేంద్రియ కార్బన్ శాతం మేలు రకమైన సూక్ష్మజీవుల సంఖ్యను పెంచే పంటల అవశేషాలను కాల్చేయకుండా నేలలోనే కలియదున్నాలని సూచించారు. నిరంతరం ఒకే తరహా పంటలు పండించకుండా ప్రత్యామ్నాయ పంటలు మార్పిడి చేస్తే నేలసారం కాపాడుకోవడమే కాకుండా చీడపీడల తీవ్రతను తగ్గించుకోవచ్చని ఏవో రైతులకు సూచించారు.

## మౌలిక సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కు సర్పంచ్ వినతి



**బూర్గంపహాడ్ ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలంలోని పినపాక పట్టీనగర్ లో నెలకొన్న మౌలిక సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ సర్పంచ్ బానోత్ పద్మ మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పాయం పంచాయతీ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని, పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు బందెల ప్రభాకర్, సీనియర్ నాయకులు బానోత్ రాజేష్, పొన్నం నాగేందర్, కారం శ్రావణ్, వార్డుసభ్యులు వినయ్, చంద్రగిరి వెంకటేశ్వర్లు, జంగం లక్ష్మణ్, మరసట్ల సురేందర్, దోమల లాజర్లు పాల్గొన్నారు.

## బొడ్రాయి పునర్ ప్రతిష్ట కొరకు కృషి

**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేటలో నూతన బొడ్రాయి పునర్ ప్రతిష్ట కొరకు తన వంతుగా కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు. మంగళవారం బొడ్రా బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరంలో ప్రత్యేక పూజల అనంతరం బిఆర్ఎస్ నాయకులు షీలా శంకర్ కోరిక మేరకు మందిరం ప్రక్కనే ఉన్న బొడ్రాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు, నాయకులను సంప్రదించి నూతన బొడ్రాయి ప్రతిష్ట కొరకు కృషి చేస్తానని తెలిపారు. వీరి వెంట కౌన్సిలర్ వల్దాసు లక్ష్మి శ్రీనివాస్, ఆర్యవైశ్య నాయకులు రాచర్ల వెంకటేశ్వరరావు, రాచకొండ శ్రీనివాస్, సోమ సుమన్ తదితరులు ఉన్నారు.



## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత..

**జనంసాక్షి, మిర్యాలగూడ( ఫిబ్రవరి 25):** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ను మిర్యాలగూడ పోలీసులు పట్టుకున్నారు.. మిర్యాలగూడ పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి సుమారు 8 క్వింటాల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా స్థానిక కబరస్థాన్ వద్ద వన్ టౌన్ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్టు స్థానికులు తెలిపారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తి ఎవరు ఏంటి అనే విషయాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్టు సమాచారం.

# గిరిజన విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ○ అన్ని గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆశ్రమ పాఠశాలలుగా మార్చాలి
- ○ పండిట్స్,పిఈటి పోస్టులను అప్గ్రేడ్ చేయాలి
- ○ సిఆర్టిలను,డైలీ వేజెస్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి
- ○ ఈనెల 26న ఐటీడీఏ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన
- ○ టిపిటిఎఫ్ డిమాండ్



**టేకులపల్లి,ఫిబ్రవరి 24 (జనంసాక్షి):** గిరిజన సంక్షేమ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గుగులోతు హరిలాల్ నాయక్, గుగులోతు భాగ్య రావు లు డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత సంవత్సరం అక్టోబర్ నెల చివరి వారంలో గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కి ప్రత్యక్ష చర్య నోటీసు ఇచ్చినప్పటికీ,ఈ నెల 15న భద్రాచలంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రికి సమస్య లతో కూడిన వినతి పత్రం ఇచ్చినప్పటికీ,గత సంవత్సరం నవంబర్ నెలలో 12,13 తారీకులలో రాష్ట్రవ్యాప్తం గా మొదటి దశ పోరాటంలో భాగంగా అన్ని గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కరించబడకపోవడం లేదా చర్చలు చేయబడకపోవడంతో అనివార్యముగా, రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 26న అన్ని జిల్లాలలో జిల్లా కలెక్టర్లకు,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారు లకు మెమోరాండం సమర్పించడం జరుగుతుందని, వచ్చేనెల10న గిరిజన సంక్షేమ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన జరపనున్న ట్లు వారు తెలిపారు. ఇల్లందు టి పి టి ఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్షులు భూక్య వెంకట్రామ్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలలో భాషా పండితుల,పిఈటిల పోస్టులను వెంటనే అప్గ్రేడ్ చేసి వారికే పదోన్నతులు ఇవ్వాలని,సిఆర్టిలకు,డైలీ వేజ్ వర్కర్లకు మినిమం టైమ్ స్కేల్ ఇచ్చి వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని,వారికి ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 317 అలాకేషన్లలో స్థానికత కోల్పోయి న వారికి షరతులతో కూడిన డిప్యూటేషన్లకు కన్వ ర్టెడ్ ఆశ్రమ పాఠశాలలలోని ఖాళీలను పరిగణించాలని అన్ని కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలలో రెగ్యులర్ పోస్టులను మంజూరు చేయాలని,అన్ని ప్రాథమిక పాఠశాలలకు పిఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని,సర్వీస్ పర్సన్లను నియమించాలని, ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు అన్ని రకాల గ్రాంట్లు విడుదల చేయాలని,గిరిజన సంక్షేమ శాఖలో కామన్ సర్వీస్ రూల్స్ రూపొందించి ఉపాధ్యాయు లకు గ్రేడ్ వన్ హెచ్డబ్ల్యూఓ, ఎటిడిఓ, డిటిడిఓ, డిడిలుగా ప్రమోషన్లలో అవకాశాలు కల్పించాలని, అన్ని ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు హెచ్డబ్ల్యూఓ పోస్టులు మంజూరు చేయాలని,అన్ని వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేయాలని, అన్ని జిల్లాలలో ఒకే విధమైన పరిపాలన పర్యవేక్షణ అకడమిక్ విధానం అమలు చేయాలని,గిరిజన సంక్షేమ శాఖలో ప్రత్యేక టిఆర్టిని నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 26న ఐటీడీఏ భద్రాచలం కార్యాలయం ఎదుట, మార్చి 10న కమిషనర్ గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం హైదరాబాద్ ఎదుట టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన కలదని,ఈ నిరసన ప్రదర్శనలలో ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు, సిఆర్టిలు,డైలీ వేజెస్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాయం సర్వేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు కాయం లక్ష్మీనారాయణ,బానోత్ రాజారత్నం,మండల కార్యదర్శి భూక్య రాములు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**కల్లూరు ఫిబ్రవరి 24(జనంసాక్షి)**

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల రైతు వేదిక నందు కల్లూరు మండల వ్యవసాయ అధికారి మాదాబత్తుల రూప అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రూప మాట్లాడుతూ ప్రకృతి సేద్యం వలన నేల కాలుష్యం, వాతావరణం కాలుష్యం తగ్గి పంట నాణ్యత సూక్ష్మజీవుల లభ్యత పెరుగుతుందని తెలియజేశారు . వైరా కెవికె శాస్త్రవేత్త ఫణిశ్రీ సేంద్రియ వ్యవసాయానికి అవసరమై నటువంటి వర్మి కాంపోస్ట్, గోమూత్రం,ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పుల్లటి మజ్జిగ, బ్రహ్మాస్త్రం దశపర్ణిక, నీమాస్త్రం ఆధారిత శీఘ్రకారకాలు తయారీ, వాడకం తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి కల్లూరుఏఎంసీ చైర్మన్ కల్లూరు నీరజా దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని సేంద్రియ సాగు ఆవశ్యకతను వివరించి రైతులకు మట్టి నమూనా పత్రాలను అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బత్తులపల్లి ,సి ఆర్ పి లు రైతులు పాల్గొన్నారు.

### కల్లూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు

# తన వంతు కృషి చేస్తా

**చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్**







**కల్లూరు ఫిబ్రవరి 24(జనంసాక్షి)**

నూతనంగా ఏర్పడిన కల్లూరు మున్సిపాలిటీ ని ప్రజలు ప్రజాప్రతి నిధులు అధికారుల సహకారంతో మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులతో సమన్వయంగా వ్యవహరిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి పరచి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ తెలిపారు. మంగళవారం కల్లూరు పట్టణంలోని 14, 15 వార్డుల పరిధిలో నెలకొన్న సమస్యలను నేరుగా ప్రజలను కలిసి తెలుసుకునేందుకు చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, కౌన్సిలర్లు యాస నాగమణి శ్రీకాంత్, రేష్మ ఇంతియాజ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకు లతో క్షేత్రస్థాయిలోఅన్ని వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అంతర్గత రహదారులు, డ్రైనేజీ కాలవ లు, విద్యుత్ వీధిలైట్ల ఏర్పాటు, పరిసరాల పరిశు భ్రత, పారిశుధ్య నిర్వహణ త్రాగునీటి సరఫరా తదితరఅంశాలనుపరిశీలించారు.ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యల వివరాలను అడిగి తెలుసు కున్నారు. డ్రైనేజీ సౌకర్యం, సిసి రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు, స్వచ్ఛమైన త్రాగునీటి సరఫరా, కోతులు కుక్కల బెడద నుంచి రక్షించాలని, తదితర సమస్య లను పరిష్కరించాలని చైర్మన్ మోహన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల నుంచి క్షేత్రస్థాయి లో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చైర్మన్ మోహన్ నాయక్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇదే సందర్భంలో కల్లూరు పట్టణానికి చెందిన నిర్మల్ జిల్లా రెవిన్యూ జాయింట్ కలెక్టర్ లక్కినేని కిషోర్ కుమార్, వారి సోదరుడు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, కుటుంబ సభ్యులు కల్లూరు లోని తన స్వగృహానికి మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ కోటేశ్వరి ఆయా వార్డుల కౌన్సిలర్లను ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. నూతనంగా ఏర్పడిన కల్లూరు మున్సిపాలిటీని ప్రణాళిక ప్రకారంగా సమగ్రంగా అభివృద్ధి పరచా లని, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శవంత మైన పాలన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలకుంట నరసింహారావు, మద్యబోయిన నాగరాజు, యాస శ్రీకాంత్, బొల్లం రామారావు, శీలం కృష్ణారెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాజీ బాయ్, సయ్యద్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువులో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### పేద విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు పంపిణీ



**తుంగతుర్తి ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**

విద్యార్థులు చదువు పట్ల మక్కువ పెంచుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు, మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్కేల్ లు పంపిణీ చేసి మాట్లాడారు, తన మేనమామ ధర్మారపు ఉప్పలయ్య జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్ లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు,చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని,విద్యార్థులకు తోడ్పాటు అందించాలని తన మేనమామ ఉప్పలయ్య కలగన్న ఆశయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరుతూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అల్వాల ప్రవీణ్ కుమార్,మండడి కవిత, ఫిజికల్ డైరెక్టర్ కొండగడుపుల యాకయ్య, గుజ్జ భాస్కర్,సహదేవ్,రాజు, కొండ పరశురాం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు చేపట్టాలు

### బ్యాంకు ఒత్తిళ్లతో అమాయకులకు ఇబ్బందులు



**కారేపల్లి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :**

మహిళల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకున్న విజేత మండల మహిళ సమాఖ్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండెబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలో జరిగిన ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజేత మండల మహిళా సమైక్య సిబ్బంది మొట్లగూడెం, పేరేపల్లి, మాదారం, పోలంపల్లిగ్రామ సమాఖ్య ల పరిధిలోని గ్రామాలలోని గ్రూపు సభ్యుల పేరుతో అక్రమంగా సీసీఐఎఫ్, స్త్రీ నిధి రుణాలు తీసుకున్నారన్నారు. రుణాల మంజూరు చేయించే సందర్భం లో పర్సంటేజీ తీసుకొనటమే కాకుండా ఏకంగా గ్రూపు సభ్యుల పేరుతో రుణాలు తీసుకొని తమే తిరిగి చెల్లిస్తామని నమ్మబలికి కొంతకాలం చెల్లించారన్నారు. అక్రమంగా తీసుకున్న రుణాలను చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు అమాయక గ్రూపు సభ్యులు కట్టాలని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రూపు సభ్యులకు చెందిన పొదుపు ఖాతాలను హోల్డ్‌లో పెట్టటం, జప్తులు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు.వీరిపై సరైన అజమాయిషి లేక పోవటమే దీనికి కారణమన్నారు. గ్రూపు రుణాలపై సోషల్ ఆడిట్ నిర్వహించి అక్రమాలను వెలికి తీయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత గ్రూపు సభ్యులకు న్యాయం చేయకుండా ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐద్వా నేతలు సూరబాక ధనమ్మ, కేశగాని నీలిమ, కరపటి సీతమ్మ, పాయం వరలక్ష్మి, బానోత సరోజ, బమ్మల ధనమ్మ, వెంకట లక్ష్మి, రమాదేవి స్వరూప రాణి, పద్మ, కోటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులపై అసత్య ఆరోపణలు సరికాదు

- మహిళా ఉద్యోగినిని దుర్భాషలాడితే వత్తాసు పలకాలా..?
- బాధిత ఉద్యోగిని ఫిర్యాదు చేస్తే ... కాంగ్రెస్ పై నిందలా..?
- ప్రత్యక్ష వీడియోలు ఉన్నా సీపీఐ నేతలకు కనిపించట్లేదా?
- విలేకరుల సమావేశంలో ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు..



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):**

అవుట్ సోర్సింగ్ హౌసింగ్ ఉద్యోగినిపై అమర్యాదగా... అనుచితంగా వ్యవహరిస్తూ... దుర్భాషలాడిన ఏదులాపురం మాజీ సర్పంచ్, సీపీఐ ఖమ్మం రూరల్ మండల నాయకులు చెరుకుపల్లి భాస్కర్ పై చట్టపరమైన చర్యలకు మాకు ఎలాంటి సంబంధం లేదని ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తప్పుడు పనులు చేస్తూ అధికార పార్టీపై బురదజల్లటం ఆ పార్టీ నాయకులకే చెల్లిందన్నారు. వరంగల్ క్రాస్ రోడ్డులోని 29వ వార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. గృహ నిర్మాణ శాఖ ఉద్యోగ విధుల్లో భాగంగా సిబ్బందితోపాటు కలిసి వచ్చిన మహిళా ఉద్యోగినిని... వందలాదిమంది చూస్తుండగా చెరుకుపల్లి భాస్కర్ దుర్భాషలాడారని, ఇదే విషయమై ఆమె ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనకు సంబం ధించిన వీడియోలతో సహా సోషల్ మీడియాలో తిరుగుతున్నా... స్థానిక సీపీఐ నాయకులు 'మసిపూసి మారేడు కాయ చేయాలని' చూస్తుండటాన్ని తప్పుబట్టారు. జరిగిన ఘటనకు చింతించకుండా అధికార పార్టీ స్థానిక నాయకులపై అవాకులు చెవాకులు పేలుతుండటాన్ని ఖండించారు. మహిళా ఉద్యోగినిని దుర్భాషలాడితే... వత్తాసు పలకాలనే రీతిలో సీపీఐ నాయకులు మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. చేసేవి చేస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకులపై విషం చిమ్మడం సీపీఐ ఏదులాపురం నాయకుల కే చెల్లిందన్నారు. సీపీఐపై రాజకీయ కక్షలు పెట్టుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. జరిగిన ఘటనను వక్రీకరించే రీతిలో ఆ పార్టీ నాయకుల వ్యవహార శైలి ఉంది తప్ప... సోషల్ మీడియాలో వచ్చిన ఆ ఘటన వీడియోలు జనం చూశారు...దానిని సరిదిద్దు కోవాలనే ఇంగితం లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఏదులాపురం సీపీఐ నాయకులు గుడ్డ కాళ్ళి మిడేసే ధోరణి మానుకొని..వాస్తవాలను గ్రహించి కాంగ్రెస్ మీద ఆరోపణలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, 29వ వార్డ్ కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు, భూక్యా సురేష్ నాయక్, వెంపటి రవి,వెంపటి సురేష్, ప్రద్యుమ్న చారి, నూకల రామ్మోహన్ రెడ్డి, కె. శిరిషా రంజిత్ రెడ్డి, కళ్యం శేషిరెడ్డి, ఎర్ర శేఖర్ రెడ్డి, రామిశెట్టి రమేష్, అశోక్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సురేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పైసలు పోయినా..
# పదవి దక్కక పాయె!

## మున్సిపల్ ఎన్నికల ఓటమిపై అభ్యర్థుల ఆవేదన



**చండూరు, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా పోటీ చేస్తివి.. గెలుస్తామన్న ధీమాతో పోటాపోటీగా ఖర్చు పెట్టితివి.. తీరా చూస్తే పైసలన్నీ పోయినా గెలువకపోతిమి.. అప్పులే మిగిలాయి. అంటూ.. చండూరు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల ఖర్చు కోసం చేసిన అప్పులు కొండలా పెరిగి పోతాయని, వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

**వార్డుల్లో నోట్ల వర్షం.. ఫలితం మాత్రం నిరాశే!**
చండూరు మున్సిపాలిటీలో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం నీళ్లలా డబ్బు ఖర్చు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఒక్కో అభ్యర్థి రూ. 10 లక్షల నుండి రూ. 50 లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కొన్ని సమస్యాత్మక మరియు ప్రతిష్టాత్మక వార్డుల్లో ఒక్కో వార్డుకు కలిపి కోటి రూపాయలకు పైగానే వెచ్చించినట్లు లెక్కలు వేస్తున్నారు.చైర్మన్ పీఠంపై కన్నేసిన కొందరు అభ్యర్థులు, తాము కౌన్సిలర్గా గెలిస్తేనే ముందడుగు వేయగలమని భావించి విచ్చలవిడిగా ఖర్చు చేశారు.

**అప్పుల ఊబిలో అభ్యర్థులు**
ఎన్నికల బరిలో నిలిచిన వారు గెలుపు కోసం తమ వద్ద ఉన్న పొదుపు మొత్తమే కాకుండా అనేక మార్గాల్లో నిధులు సమకూర్చుకున్నారు. భూముల విక్రయం/తాకట్టు చాలా మంది తమ సొంత వ్యవసాయ భూములను అమ్ముకోగా, మరికొందరు విలువైన పత్రాలను తాకట్టు పెట్టి నగదు తెచ్చారు.వడ్డీ వ్యాపారుల వద్ద అత్యవసరంగా డబ్బు అవసరం పడటంతో భారీ వడ్డీలకు అప్పులు తీసుకున్నారు. నామినేషన్ వేసినప్పటి నుండి ప్రచారం ముగిసే వరకు కార్యకర్తల మేత, మద్యం, వాహన ఖర్చులు తడిసి మోపెడయ్యాయి.

**క్షేత్రస్థాయి పరిస్థితి:**
చండూరులోని ఒక వార్డులో ప్రధాన పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి సుమారు రూ. 40 లక్షలు ఖర్చు చేసినా, కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేక మూడో స్థానానికి పడిపోవడంతో తన సన్నిహితుల వద్ద కన్నీరుమున్నీరవుతున్నారు. నేతల ముఖం చాటు.. ఒంటరి పోరాటం గెలిచినప్పుడు నీరాజనాలు పట్టిన పార్టీ ముఖ్య నేతలు, ఓడిపోయాక కనీసం పరామర్శించడానికి కూడా రాకపోవడం అభ్యర్థులను మరింత కుంగదీస్తోంది. అప్పుల వాళ్ల ఒత్తిడి ఒకవైపు, పార్టీ నేతల నిర్లక్ష్యం మరోవైపు ఉండటంతో వీరు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. "కుదువ పెట్టిన భూమి ఎలా విడిపించుకోవాలి? ఈ అప్పులు ఎలా తీర్చాలి?" అంటూ అభ్యర్థులు పడుతున్న ఆందోళన ఇప్పుడు చండూరులో చర్చనీయాంశంగా మారింది.

### పసిపాప చావుకి కారకులను కఠినంగా శిక్షించాలి

**సపవత్ సర్దార్ నాయక్**



**నాంపల్లి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో కుల వివక్ష చూపిన రెడ్డి సామాజిక వర్గాన్ని చట్టపరంగా శిక్షించి పసిపాప చనిపోవడానికి కారకులైన వారినీ వెంటనే కఠినంగా శిక్షించాలని నాంపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఎస్ టి సెల్ అధ్యక్షుడు సపవత్ సర్దార్ నాయక్ నాంపల్లి మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో డిమాండ్ చేస్తూ దేశానికి స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు దాటిన అగ్రవర్ణాలు మాత్రం కుల వివక్షత పై దుమారం లేపుతున్నారని బిసి ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఇతర కులాలను రాజకీయం సామాజికం ఆర్థికంగా అనగదొక్కడానికి రెడ్డి సామాజిక వర్గాల చర్యలు కొనసాగుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు భారతీయ సంస్కృతిని అడుగంటే విధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటూ పసిపాప ప్రాణం తీసిన వారిని అదుపులోకి తీసుకొని చట్టపరంగా శిక్షించాలని ఆయన కోరారు.

### రాంబాబు కుటుంబానికి ఆర్థిక సహాయం



**గరిడేపల్లి, ఫిబ్రవరి 24 (జనం సాక్షి):**
గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన మిట్టపల్లి రాంబాబు అకాల మృత్యుహరణం తీవ్ర భయానకమని తన తోటి చిన్ననాటి స్నేహితులు తీవ్ర మనోవేదనను వ్యక్తం చేశారు.జన్మనిచ్చిన వృద్ధ తల్లిదండ్రులకు ఎదిగిన తన ఇద్దరు పిల్లలకు బాసటగా నిలవాల్సిన ఈ ఆపన్న సమయంలో ఏమీ తెలియని తన అర్ధాంగిపై బాధ్యతలు పెట్టి తిరిగిరాని లోకాలకు వెళ్లిన ప్రియ నేస్తం కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటామని తెలుపుతూ వారి కుటుంబానికి యాభైవేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలియజేశారు. రాంబాబు కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుతూ ముందుగా రాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో సినర్జీ ఫెస్టిసైడ్స్ అధినేత సుందరి వీరభాస్కర్, ఏడిఇ తాటికొండ కిరణ్, బోలిశెట్టి రమేష్, గోపగాని శ్రీధర్, క్రియేటర్ జిల్లా శ్రీనివాస్, ఆర్గనైజర్ ఆర్టీసీ కండక్టర్ కటారు భాగ్య రావు, మాజీ సర్పంచ్ నందిపాటి సైదులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోకల వెంకటేశ్వర్లు, ఫెస్టిసైడ్స్ డీలర్ మచ్చ కృష్ణ, ఆదర్శ రైతు చందా గోపిరెడ్డి, విద్యా సంస్థల అధినేతలు బాల్తూ అజయ్, నేలపట్ల శ్రీనివాస్, ధాన్యం వ్యాపారి కుక్కడపు నరసింహారావు, నక్క శ్రీనివాస్, మేము సైతం అంటూ ప్రతి కార్యక్రమంలో అందరికంటే ముందు ఉంటుందా మన సోదరీమణులు తిపిరిశెట్టి శోభ, పి.పద్మ, సులోచన, ఉమావతి, జె. పద్మ, శోభ, కాంపౌండర్ రాములు, బొలిశెట్టి నాగేంద్రబాబు, పత్తిపాక శోభన్ బాబు, కానుగు వెంకన్న, పోట్ల రంగారావు, మామిడి వెంకన్న తదితరులున్నారు.

# మానవ తప్పిదాలతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు

- జీవితంలో క్రమశిక్షణగా ఉంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చు
- డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి
- మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపవద్దు
- మైనర్ డ్రైవింగ్ తో.. మీకు ఎదుటి వారికి ప్రమాదం
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
రోడ్డు ప్రమాదాలను నివారించడం, రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు మరణించకుండా సురక్షితంగా గమ్యం చేరడం, రోడ్డు భద్రతా నియమాలు తెలియజేయడం లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహోద్యమం కార్యక్రమంనిర్వహించడం జరుగుతుంది.జిల్లా వ్యాప్తంగా వారం రోజులపాటు ప్రజలకు రోడ్డు భద్రత పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై రోడ్డు భద్రత నివారణ చర్యల గురించి మాట్లాడారు.జీవితంలో క్రమశిక్షణ ఉంటే ఉన్నత స్థానాలకు చేరుతారని,రోడ్డుపై క్రమశిక్షణ ఉంటే సురక్షితంగా గమ్యానికి చేరుతారని అన్నారు.విద్యార్థులు బాధ్యతగా ఉండాలని, రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించడంలో, రోడ్డు ప్రమాదాలు నివారించడంలో విద్యార్థులు ఆదర్శంగా, ప్రచారకర్తలుగా ఉండాలన్నారు. మానవ తప్పిదాల వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోకూడదనేదే పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు.ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలతో సురక్షిత గమ్యం సాధ్యం అవుతుందన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలని పేర్కొన్నారు.మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని, మైనర్ డ్రైవింగ్ తో మీకు,ఎదుటి వారికి ప్రమాదం సంభవిస్తుందని అన్నారు.రోడ్డుకు లెఫ్ట్ సైడ్ డ్రైవింగ్ ఆల్ వేస్ రైట్ అని, మనం క్షేమంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలు సాధిస్తామన్నారు.మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని సూచించారు. అతివేగంగా వాహనాల నడపడం ప్రమాదం అన్నారు. ప్రతి వాహనానికి అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, వాహనదారుడు లైసెన్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించడం గోల్డెన్ అవర్ ముఖ్యమని, త్వరితగతిన ఆసుపత్రులకు చేర్చడం వల్ల క్షతగాత్రుల ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు.




రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి బాధ్యతగా సహాయసహకారాలు అందించి ప్రాణాలు కాపాడితే రహదారి హీరోగా కీర్తించి నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందని తెలిపారు. హెల్మెట్ లేకపోతే విద్యా సంస్థలలోకి ద్విచక్ర వాహనాలు అనుమతించవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే వాహనం సీజ్ చేస్తామన్నారు. యువత నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఆదర్శంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, కళాశాల ప్రిన్సిపల్ ముత్యాలరావు, కళాశాల సిబ్బంది శ్రీనివాస్, వెంకన్న, నాగరాజు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### బీజేపీ నేతను పరామర్శించిన రాష్ట్ర ఓబీసీ నాయకులు నారోజు కుమారస్వామి

**మర్రిగూడ, ఫిబ్రవరి 24 (జనం సాక్షి)**
నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం తాన్దర్లపల్లి గ్రామం చెందిన బీసీ నేత బీజేపీ మండల్ నాయకులు వట్టికోటి జగన్ హైద్రాబాద్ ఓంకార్ నగర్ లో గల అగస్త్య హాస్పిటల్ లో గుండె పోటుతో చికిత్స పొందుతున్న జగన్ ను మంగళవారం రాష్ట్ర ఓబీసీ నాయకులు నారోజు కుమారస్వామి చారి పరామర్శించివారికి జరిగిన చికిత్స వివరాలను గుండె సంబందించిన వివరాలను వారికీ చికిత్స చేసిన గుండె డాక్టర్ తో మాట్లాడడం జరిగింది. వీరివెంట మర్రిగూడ మండలం కార్యదర్శి నారగోని యాదగిరి యాదవ్,బండోజు రవి, వట్టికోట రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడికి కుర్చీలు, న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

**కోదాడ, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):**
అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు మర్రి సంతోష్ సేవా కార్యక్రమాలతో మరోసారి ముందుకు వచ్చారు. గ్రామ అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల కోసం తన సొంత ఖర్చులు రూ.10,000 తో 15 కుర్చీలు, గర్భిణీ స్త్రీలు, బాలింతల కోసం న్యూట్రిషన్ కిట్లను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. చిన్నారుల విద్యాభివృద్ధి, గర్భిణీల ఆరోగ్య పరిరక్షణకు తన వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని మర్రి సంతోష్ తెలిపారు.అంగన్వాడి టీచర్ దేవేంద్ర, ఆయా రవణ మాట్లాడుతూ కేంద్రానికి అవసరమైన సదుపాయాలు కల్పించినందుకు మర్రి సంతోష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామ యువకులు, మహిళలు ,సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. గ్రామాభివృద్ధికి మర్రి సంతోష్ ఎల్లప్పుడూ ముందుండాలని వారు ఆకాంక్షించారు.గాదె రామారావు, ఉయ్యాల రాంప్రసాద్, గాదె మహేష్, పూలదాసు రామయ్య, ఐతనబోయిన సురేష్, కంటూ గోపి, కంటూ నరేష్, గాదె సైదులు, రెడ్డబోయిన వీరబాబు, గోవింద మహేష్ ,గాదె సైదిబాబు, పిట్టల హరీష్ ఉన్నారు.



## ఘనంగా రథోత్సవం

**దేవతామూర్తులకు హారతి లిస్తు**

**మొక్కులు చెల్లించుకున్న భక్తులు**



**కనగల్లు, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
అంతంపేట గ్రామంలోని సోమరాజు గూడ సోమేశ్వరాలయ జాతరలో భాగంగా మంగళవారం డప్పు చప్పులతో మేల వాయిద్యాల నడుమ అర్చకుల వేదమంత్రాలతో రథంపై దేవతామూర్తులను ఆసీనులు చేసి పూలమాలలతో దివ్యాంగ అలంకరించిన రథాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. ఊరేగింపు కొనసాగుతున్న సమయంలో భక్తులు దేవతామూర్తులకు జల హారతులు ఇస్తూ కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేజిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, సర్పంచ్ శ్రీలత వెంకటేశం ఇందుర్తి గ్రామవాసి కుంభంసత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి నామిని జగన్నాథం, ఎస్సై సంజీవరెడ్డి, శ్రీశైలం గౌడ్, రాచమల్ల వెంకట్ రెడ్డి, గుడి చైర్మన్ మాడుగుల నవీన్, అర్చకులు పూసపాటి శంకరప్ప, ఓసి రెడ్డి, రామ్ రెడ్డి, సిరప్ శేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట (జనంసాక్షి) :**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదగాని నాగేశ్వరరావు, శనగల యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ కంటి హాస్పిటల్, సూర్యాపేట వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు,ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు,అర్హులైన రేషన్ కార్డు కలిగిన వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అంగన్వాడీ కేంద్రాలపై సర్పంచుల పెత్తనమా..?

○ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్న తీవ్ర నిరసన ○ రాజకీయ జోక్యంపై ఆందోళన...

○చిన్న చిన్న కారణాలతో అంగన్వాడీ కార్యకర్తలను, సహాయకులను వేధించే అవకాశం..

○గ్రామాల్లో ఉండే రాజకీయ వర్గపోరు అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై పడే ప్రమాదం..




**చందూరు ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
నల్గొండ జిల్లాలోని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలకు అండగా నిలుస్తున్న అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. అంగన్వాడీలపై సర్పంచులకు పెత్తనం కల్పిస్తూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సంబంధిత ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం వల్ల క్షేత్రస్థాయిలో రాజకీయ జోక్యం పెరిగి, సేవలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది.నల్గొండ జిల్లాలో 31 మండలాలు,4 రెవిన్యూ డివిజన్ లు(నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ, చండూరు) 844 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 2093 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇవి 9 ప్రధాన ప్రాజెక్టుల పరిధిలో పనిచేస్తున్నాయి.

**ప్రీ-స్కూల్ విద్య, పౌష్టికాహారం**
గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు చంటి పిల్లలకు 'బాలామృతం' వంటి పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నాయి.
ఆరేళ్ల లోపు పిల్లలకు ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్యను బోధిస్తూ, వారిని పాఠశాల వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి, గుర్రంపోడు వంటి మండలాల్లో ఈ కేంద్రాలు అత్యధిక సంఖ్యలో ఉన్నాయి. ఇవి సొంత భవనాలు, అద్దె భవనాలు లేదా పంచాయతీ కార్యాలయాల్లో కొనసాగుతున్నాయి.

**రాజకీయ జోక్యంపై ఉద్యోగుల ఆందోళన...**
గతంలో పాఠశాలలపై ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉన్న సమయంలో ఉపాధ్యాయులు అనేక వేధింపులకు గురయ్యారని, బదిలీల విషయంలోనూ రాజకీయ జోక్యం ఎక్కువగా ఉండేదని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అంగన్వాడీల బాధ్యతను సర్పంచులకు అప్పగించడం వల్ల చిన్న చిన్న కారణాలతో అంగన్వాడీ కార్యకర్తలను, సహాయకులను వేధించే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.రాజకీయ పెత్తనం గ్రామాల్లో ఉండే రాజకీయ వర్గపోరు అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఇవి అధికారుల పర్యవేక్షణలో లోటుపాట్లు లేకుండా నడుస్తున్నాయని, మళ్లీ పాత పద్ధతి తీసుకురావడం సమంజసం కాదని చర్చ జరుగుతోంది.ఇటీవలే ప్రభుత్వం అంగన్వాడీల స్థాయిని పెంచి, వేతనాల విషయంలో మార్పులు చేసింది. ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచడంతో పాటు, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ. 1 లక్ష అందించాలని నిర్ణయించింది. ఈ తరుణంలో సర్పంచుల జోక్యం అవసరమా.. అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో రాజకీయ జోక్యం పెరిగితే పేదలకు అందే సేవలు కుంటుపడే అవకాశం ఉందని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి కేంద్రాల స్వయంప్రతిపత్తిని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## దాతృత్వం చాటుకున్న లింగోటం సర్పంచ్ ఏడుదొడ్ల విజిత ప్రభాకర్ రెడ్డి

**నాంపల్లి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన అన్నేపాక యాదయ్య సోమవారం రాత్రి ఆకస్మికంగా చనిపోవడంతో విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ఏడుదొడ్ల విజిత ప్రభాకర్ రెడ్డి అక్కడికి చేరుకొని యాదయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి,నివాళులర్పించి యాదయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసి అంత్యక్రియల కొరకు 10000(పదివేల రూపాయలు)ఆర్థిక సహాయం అందించారు.
వీరితో పాటు వార్డు సభ్యులు నల్లపు వెంకటయ్య,నల్లపు నాగరాజు,గడ్డి వెంకన్న,కీత హరినారాయణ,దుబ్బ సతీష్, బుషిపాక దశరథ,గడ్డి పుల్లయ్య, సురిగి నరసింహ,దుబ్బ కృష్ణయ్య,దుబ్బ పెద్ద యాదయ్య తదితరులు ఉన్నారు.



## స్పందన జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష ఏర్పాట్లు పూర్తి

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
పట్టణంలోని స్పందన జూనియర్ కళాశాలలో నేడు జరిగే ఫస్ట్ ఇయర్ తెలుగు మరియు సంస్కృత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అడిషనల్ చీఫ్ సూపర్డెంట్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి రోజు తెలుగు మరియు సంస్కృత పరీక్షకు 193 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.అనంతరం పరీక్ష గదులలో డ్యూయల్ డెస్క్ ల మీద హాల్ టికెట్ల నెంబర్లను పొందుపరిచారు. పరీక్షకు మొత్తం 12 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ సూపర్డెంట్ వీరన్న డిపార్ట్మెంటల్ ఆఫీసర్ రమేష్ కళాశాల అధ్యాపకులు వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, నాగ ప్రసాద్, నగేష్, శ్రీధర్, ప్రభాకర్, లింగారెడ్డి, సైదిరెడ్డి,సతీష్, శ్రీనివాస చారి,పాల్గొన్నారు.

## శివాజీ విగ్రహానికి విరాళం

**వలిగొండ,ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
మండలంలోని వెల్వర్తి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీ విగ్ర ఆవిష్కరణ సందర్భంగా కీర్తిశేషులు బొడ్డు రాఘవరెడ్డి ప్రమీల రెడ్డి, మత్స్యగిరి గుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవగా ఒక్కొక్కరు 25 వేల చొప్పున 50,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి కమిటీ అధ్యక్షుడు సామల కొండల్ రెడ్డి , కమిటీ సభ్యులు ధన్యవాదములు తెలిపారు.





## వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ లెజెండ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేత

హుజూర్ గర్, (జనంసాక్షి):

వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ లెజెండ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిబాబా కళ్యాణమండపం నందు కుట్టుమిషన్ దాత ఊరే వెంకయ్యఇందిరా దాతృత్వంతో తమ్మన సుజాత నాగేశ్వరరావు సహకారంతో 7000/- విలువ గల కుట్టు మిషన్ పేదలైన కాకి హరిపిత మహిళకు జీవనోపాధి కోసం కుట్టు మిషన్, పేదింటి నరసింహులు కి 25 కేజీలు బియ్యము, కూరగాయలు ఉచితంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ కరాలపాటి పాపారావు, వాసవి క్లబ్ అధ్యక్షులు వీరవెల్లి వెంకటేశ్వర్లు(కొండలు), ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటేశ్వర్లు, కోశాధికారి కాళంగి నరసింహారావు, వాసవి వనిత క్లబ్ లెజెండ్ జోనల్ చైర్మన్ పోలిశెట్టి ఝాన్సీ రాణి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు పెనుగొండ రాజ్యలక్ష్మి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెచ్చ శ్యామల, కోశాధికారి ఆరేటి వెంకటలక్ష్మి , సాయిబాబా దేవాలయ అధ్యక్షుడు త్రిపురమళ్ళ అంజయ్య, కామిశెట్టి శేఖర్, ఉప్పలంచు సతీష్, బురుగు శ్రీనివాసరావు, చేపూరి అనంత రాములు, నరసింహారావు, దయాకర్, ప్రవీణ్, పెండ్యాల నాని, మట్టపల్లి శ్రీమన్నారాయణ, బొగ్గవరపు రాదా, గర్నె శ్రీనివాసరావు, శ్రీదేవి, వీరవెల్లి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు 10,000 విరాళం అందజేసిన మాజీ ఎంపీపీ చనమల్ల మాధవి జగదీశ్వర్ రెడ్డి



**గుర్రంపోడు:ఫిబ్రవరి 24(జనంసాక్షి)**

నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి నవమ వార్షికోత్సవ కళ్యాణ మహోత్సవం జాతర, బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో గుర్రంపోడు మండల మాజీ ఎంపీపీ చనమల్ల మాధవి జగదీశ్వర్ రెడ్డి కళ్యాణ మహోత్సవం నిమిత్తం 10,000 రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో దేవాలయాల వార్షికోత్సవాల నిర్వహణ అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ జాల పెద్ద సత్తయ్య యాదవ్, వైస్ చైర్మన్ వెలుగు బిక్షం,దేవాలయ కమిటీ సభ్యులు పోలేపల్లి భద్రయ్య, మేడి వెంకన్న,రావుల సైదులు(ఆర్.ఎస్)గౌడ్,తగుళ్ల వెంకటయ్య, కమతం శ్రీనివాస్ రెడ్డి,ఇటికాల శేషయ్య,వెలుగు జలంధర్,పోలేపల్లి నరసింహ, పోలేపల్లి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**

జిల్లా కేంద్రంలోని శ్రీవేదాంత భజన మందిరంలో జరుగుతున్న 24వ వార్షికోత్సవ పూజల సందర్భంగా మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదితో పాటు కౌన్సిలర్లు దంతాల సాయి ప్రియ సందీప్, వల్దాస్ లక్ష్మి శ్రీనివాస్ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ 24వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎంతో పురాతనమైన ఈ మందిరం గత 74 సంవత్సరాలుగా వినాయక చవితి పూజలు, శ్రీరాముని వేడుకలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. స్వామి వారి అనుగ్రహంతో సూర్యాపేట పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.అనంతరం మందిర కమిటీ అతిధులకు సన్మానించారు.అర్చకులు ధరూరి సింగరాచార్యులు వారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, వీరవెల్లి రామమూర్తి, సోమా సుమన్, అర్చకులు రాఘవాచార్యులు, నాయకులు రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు , బజ్జూరి శ్రీనివాస్, సోమా ధనంజయ, పాల్వాయి రవీందర్,శీల శంకర్, చల్లా సత్యనారాయణ, వెంపటి సురేష్, రాచర్ల ప్రేమలత, నకిరేకంటి హేమలత, ధరూరి గోదాదేవి తదితరులు పాల్గొన్నారు.



## భావి భారత పౌరులకు బాసట

### 70 మంది విద్యార్థులకు బ్యాగులు అందజేసిన కంచర్ల యాదమ్మ

**గుర్రంపోడు: ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**

మండలంలోని తానేదార్‌పల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక సర్పంచ్ కంచర్ల యాదమ్మ మధుసూదన్ అండగా నిలిచారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 70 మంది విద్యార్థులకు రూ. 30,000 వేల విలువైన స్కూల్ బ్యాగులను ఆమె స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుండే చదువుపై ఇష్టం పెంచుకోవాలని, కష్టపడి చదివి తమ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని పేద విద్యార్థులకు తమ వంతు సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాల్వాయి ఏడుకొండలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచ్ చేసిన ఈ సామాజిక సేవను గ్రామస్తులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



## ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి

**నేరేడుచర్ల (జనంసాక్షి)**

పట్టణ కేంద్రంలోని గిరిజన ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నందు భోగ్ బండార్ కార్యక్రమం. ఘనంగా నిర్వహించారు.ఎస్. ఐ అజ్మీర్ రవీందర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బంజారా జాతి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, మూఢనమ్మకాల నుండి విముక్తి కల్పిస్తూ,అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్. ఆయన జీవితం సేవ, త్యాగం, ధర్మనిష్ఠకుప్రతీక. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ ప్రాంత చరిత్ర కూడా బంజారా సమాజంతో ముడిపడి ఉంది. అలాగే సేవాగఢ్ నుండి పోహారాగఢ్ వరకు ఆయన ఆధ్యాత్మిక యాత్ర బంజారా సమాజానికి చిరస్థాయిగా నిలిచింది.తెలంగాణ ప్రభుత్వం కూడా సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా గుర్తించి ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక నాయకులు. ఆర్ కోటేశ్వరావు నాయక్, బి మంగమ్మ, కోటి నాయక్, రమావత్ పాండు నాయక్, డాక్టర్ రమావత్ మేఘన నాయక్, ఎల్ శ్రీను నాయక్, ఆర్ కిరణ్ నాయక్, బి.సైదా నాయక్, ఆర్. నరి నాయక్, ఏ. అంజి నాయక్, ఆర్ మంగ్య నాయక్, ఏ. అంజి నాయక్, బి నాగరాజు, ఆర్ సైదమ్మ, సైదా నాయక్, బి .శ్రీధర్ నాయక్, ఆర్ మేఘ్య నాయక్ ఆర్ నరేష్ నాయక్ ఆర్. శ్రీ రాములు నాయక్, వాలియా నాయక్, సైదా నాయక్, టోప్రా ఏ శ్రీధర్,బంజారా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకుల హర్షం

**సూర్యాపేట(జనంసాక్షి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సౌకర్యం, జీవిత బీమా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య హర్షం వ్యక్తం చేశారు.మంగళవారం ఆ సంఘ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 మార్చి నుండి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలతో పాటు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు.ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, ప్రధాన కార్యదర్శి దండ శ్యామ్ సుందర్ రెడ్డి, కోశాధికారి ఎస్ఏ హమిద్ ఖాన్, ఎస్.నాగేశ్వరరావు, శనగల యాదగిరి, పులుసు పిచ్చయ్య, సుధాకర్, కృష్ణారెడ్డి, వీరయ్య, సత్తయ్య, సోమేశ్వరరావు, లక్ష్మీకాంతరెడ్డి, కృపాకర్ రెడ్డి, పుల్లయ్య,వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతువ్యతిరేక యాప్ రద్దు చేయండి:బిఆర్ఎస్ పార్టీ ధర్నా

**వలిగొండ, ఫిబ్రవరి 24 (జనంసాక్షి )**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ, మంగళవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ , రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. యూరియా కొరతతో సాగు పనులు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగానాయకులు మాట్లాడుతూయూరియా సరఫరాలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.ధర్నాలో పాల్గొన్న రైతులు రైతు వ్యతిరేక విధానాలు వద్దు యూరియా తక్షణమే సరఫరా చేయాలి అంటూ నినాదాలు చేశారు. సాగు కాలంలో ఎరువుల కొరత తలెత్తడం వల్ల పంటలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియా సరఫరా సమస్యను పరిష్కరించకపోతే మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మహమ్మద్ జానీ అప్రోజ్, జిల్లా నాయకులు మొగుల శ్రీనివాస్, పల్సర్ రమేష్ గౌడ్, మత్స్యగిరి గుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ కుమార్ రెడ్డి, మరయ్య,కొండూరు వెంకటేశం గౌడ్,ఐటీపముల ప్రభాకర్, స్థానిక సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వారి దేవాలయం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌కు సత్కారం

**భువనగిరి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
భువనగిరి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వారి దేవాలయం ప్రాంగణంలో ఈరోజు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. శ్రీదేవి ఉత్సవ కమిటీతో పాటు భువనగిరి కిరాణా ఒ జనరల్ మర్చంట్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ , వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్ లకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, వ్యాపార వర్గాల నాయకులు పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా దేవాలయ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధి, ప్రజా సౌకర్యాల మెరుగుదల తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వ్యాపార వర్గాలు, దేవాలయ కమిటీ సూచనలు గౌరవించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్ కూడా స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు కలెక్టర్ హనుమంతరావు ఆల్ ది బెస్ట్

### ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి : జిల్లా కలెక్టర్ ఆకాంక్ష



**భువనగిరి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
రేపటి నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన శ్రమకు తగిన ఫలితాన్ని అందుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని ప్రతీ ప్రశ్నకు ఆలోచించి సమాధానాలు ఇవ్వాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని కోరుకుంటూ, అందరికీ మరోసారి ఆల్ ది బెస్ట్ తెలిపారు.

## భువనగిరి మున్సిపల్ చైర్మన్‌గా శ్రీవాణి రవికుమార్‌కు అయ్యప్ప ఆలయంలో వేద ఆశీర్వచనం

### శబరి నగర్ దేవాలయంలో ఘన సన్మానం

**భువనగిరి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
భువనగిరి శబరి నగర్‌లోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం (24-02-2026) సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 35వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ భువనగిరి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చిరు సన్మానం చేసి వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నరేందర్ శర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనం అందించగా, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు, అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు గాదె శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు. ప్రజాసేవలో శ్రీవాణి రవికుమార్ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు మంచాల ఋషికేష్, చీకటిమల్ల రాములు, పోకుల సోమన్న, సుగ్గుల చంద్రశేఖర్, మాజీ చైర్మన్ మంచాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## అక్రమ అరెస్టులపై భువనగిరిలో బీజేపీ శాంతియుత నిరసన

### నల్ల రిబ్బన్లతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం

భువనగిరి, ఫిబ్రవరి 24 (జనం సాక్షి)
భువనగిరి పట్టణంలో ఈ రోజు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు రాష్ట్ర నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుతంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా రథసారథి శ్రీ ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. నల్ల రిబ్బన్లు ధరించడం ద్వారా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు తమ కట్టుబాటును తెలియజేస్తూ, అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామనే సందేశాన్ని ప్రజలకు చేరవేసినట్లు నాయకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర నాయకులు పడమటి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, మేడి కోటేష్, జనగాం నర్సింహ చారి, వుదరి సతీష్, కొల్లోజు శ్రవణ్ కుమార్, కోళ్ల భిక్షపతి, కొలిచెలిమ మల్లిఖార్జున్, కారుపాటు రాజు, అందే విజయ్, తాడూరి బాలశంకర్, రాజకుమార్, మహమూద్, కోళ్ల సుధాకర్, పకీర్ రాజేందర్ రెడ్డి, కాలభైరవ, దయ్యాల కుమార్, కొదురుపాక కృష్ణ ఆనంద మోహన్, సుదర్శన్, సంతోష్, ఉషా కిరణ్, పెట్టబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు. చివరగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరెస్టులను ఉపసంహరించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## కొండూరు గ్రామం సంఘ బంధం భవన నిర్మాణానికి శంకుస్థాపన

మర్రిగూడ,ఫిబ్రవరి 24 (జనం సాక్షి)
మర్రిగూడ మండలంలోని కొండూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న గ్రామ సంఘం (వివో) భవన నిర్మాణానికి మంగళవారం కొండూరు గ్రామ సర్పంచ్ అంబోతూ సీతారాం నాయక్ పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యతా ప్రమాణాలతో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు. మర్రిగూడ ఎంపీడీవో మునయ్య,పంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమార్, ఏపిఎం వెంకట్, టిఏ నరసింహ, ఉప సర్పంచ్ జాల యాదయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజా పాలనద్వారా పేదలకు మేలు



**వలిగొండ, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)**
మండల కేంద్రంలో శివసాయి ఫంక్షన్ హాల్ లో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగ ప్రవీణ్, భువనగిరి అసెంబ్లీ అధ్యక్షులు వాసుదేవ్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని వరుణ్, తదితరులు సమావేశానికి హాజరైనారు. అనంతరం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు లబ్ది చేకూరుతుందని అదేవిధంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పథకాల ద్వారా భువనగిరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అయిన అన్నారు. రానున్న రోజులలో వలిగొండ మండల పరిధిలోని ప్రతి గ్రామంలో యువజన కాంగ్రెస్ పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామని అదేవిధంగా రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికలలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడాని తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని అయన అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, దేవేందర్ అసెంబ్లీ యూత్ ఉపాధ్యక్షులు బాలు, ప్రధాన కార్యదర్శులు నవీన్, ఉదయ్, గణేష్ మండల యూత్ ఉపాధ్యక్షులు మహిపాల్, ప్రధాన కార్యదర్శి సాయి, మధు, శ్రీకాంత్, అరుణ్, వినయ్, బాలు, మురళి, వంశీ, విన్ను, బాలు, రవి, నవీన్, యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై కలెక్టర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా వినతిపత్రం

### ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా చెల్లింపు, రుణమాఫీ, యూరియా సరఫరాపై తక్షణ చర్యల డిమాండ్

**భువనగిరి, ఫిబ్రవరి 24 (జనం సాక్షి)**
రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పక్కిర్ రాజేందర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు శ్రీ ఊట్కూరి అశోక్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



**వినతిపత్రంలో పేర్కొన్న ప్రధాన డిమాండ్లు ఇవి:**
పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను ఎకరాకు రూ. 15,000 చొప్పున వెంటనే చెల్లించాలి.
రుణమాఫీ పొందని రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలి.
రైతులకు అవసరమైన యూరియా ఎరువు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలి.
పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులను వెంటనే విడుదల చేయాలి.
రాబోయే రబీ సీజన్ పంట కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికతో తగినన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
పాడి రైతులకు పెండింగ్ పాల బిల్లులను తక్షణమే చెల్లించాలి.
మదర్ డైయిరీ ఆస్తులను పరిరక్షించాలని చర్యలు తీసుకోవాలి.
ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కలభైరవ, పార్టీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, మాజీ పట్టణ అధ్యక్షులు పదరాజు ఉమాశంకర్ రావు, నర్సింహాచారి, నీలం రమేష్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు బాలశంకర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి మంగు నర్సింహారావు, మల్లికార్జున్, పట్నం కిట్టు తదితర నాయకులు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు స్పష్టం చేశారు.